# గొప్ప రక్షకుడు
## (లూకా సువార్త సంగ్రహ సమీక్ష)

**A. ఉపోద్ఘాతము :** ఒక భవన నిర్మాణపు నమూనాను అన్ని దిక్కులనుండి పరిశీలిస్తేనే దానిని సంపూర్ణంగా అర్థం చేసికోగలుగుతాము. అలాగే దైవమానవుడైన యేసు క్రీస్తు వ్యక్తిత్వాన్ని ఆయన పరిచర్యను సంపూర్ణంగా అర్థం చేసికోడానికి, నాలుగు సువార్తలు వ్రాయబడ్డాయి. అందులో మొదటి మూడు సువార్తలు "సమదృక్పథసువార్తలు" గా పిలువబడుతున్నాయి. అందులో చివరిది, లూకా సువార్త.

**1. గ్రంథకర్త :** లూకా సువార్తలో గ్రంథకర్త ప్రస్తావన లేదు. కాని పౌలు సహచరుడైన, వైద్యుడైన లూకా దీనిని వ్రాసినట్లు సార్వత్రికంగా ఆమోదించబడింది. ఇతడు సిరియాదేశస్థుడు. కొలస్సీ పత్రికలో ఇతని పేరు అన్యులనుండి క్రైస్తవులైనవారి పేర్లలో చేర్చబడింది. (కొల 4:14) అది నిజమే అయితే, క్రొత్త నిబంధన పుస్తకాలను వ్రాసిన గ్రంథకర్తలలో ఇతడొక్కడే అన్యుడు. ఇతని పేరు క్రొత్తనిబంధనలో మూడు సార్లు పౌలు ద్వారా ప్రస్తావించబడింది. (కొల 4:14; I తిమో 4:11; ఫిలె 24వ).

లూకా సువార్త 1:1-4 లోని తొలిపలుకులు అపొస్తలుల కార్యములు 1:1-2 లోని తొలిపలుకులతో పోలిస్తే, అపొస్తలుల కార్యముల గ్రంథకర్తయైన లూకాయే ఈ సువార్తను వ్రాసాడని ఋజువు అవుతున్నది. ఆదిమ సంఘ నాయకులు మరియు గ్రంథకర్తలందరు ఈ సువార్తను లూకాయే వ్రాసాడని ధృవీకరించారు.

**2. గ్రంథకర్త వ్యక్తిత్వం :** లూకా విద్యావంతుడు, సూక్ష్మగ్రాహి మరియు పరిశీలనాత్మక దృష్టిగలవాడు. కనుక మొదటి నుండి తరచి పరిష్కారముగా తెలిసికొని ఈ సువార్తను వ్రాసాడు (1:3) అనగా అతనికి పాలస్తీన భౌగోళిక స్థితి అంతా తెలుసు (8:26; 19:1; 24:13) యూదుల చరిత్ర తెలుసు (1:5; 2:1-3; 19:43, 44) పాతనిబంధనను అతడు పూర్తిగా ఎరుగును. 3వ అధ్యాయంలోని వంశావళి అందుకు నిదర్శనం. ఒక విధంగా చెప్పాలంటే యూదుడైన మత్తయి కంటె మరింత వివరంగా వంశావళిని వివరించాడు. అంత మాత్రమే కాదు లూకాకు పాలస్తీన రాజకీయ పరిస్థితులు కూడ క్షుణ్ణంగా తెలుసు. (1:15; 7:2; 20:22,24).

లూకా మంచి రచయిత, అతని రచనలో స్వచ్ఛమైన గ్రీకు భాష ఉపయోగించబడింది. అతడు వ్రాసిన విషయాలన్నీ ఒకదానికి మరొకటి కొనసాగింపుగా చక్కని పొందికతో కూర్చబడ్డాయి. ఇతడు ఒక నిజమైన, నమ్మకమైన క్రైస్తవ సేవకుడు నిజమైన స్నేహితుడు.

**3. పాఠకులు :** వాస్తవంగా ఈ సువార్త లూకా స్నేహితుడైన థెయొఫిలా అనే వ్యక్తికి, వ్యక్తిగతంగా వ్రాయబడింది. థెయొఫిలా రోమా పరిపాలనలో ఒక అధిపతి. "అతడు ఘనత వహించిన" థెయొఫిలా అని సంబోధించబడ్డాడు. ఇది ప్రభుత్వంచే ఇవ్వబడిన బిరుదు. అయితే



"థెయొఫిలా" అన్నది అతనికి ఇవ్వబడిన క్రైస్తవ నామము. ఈ పేరుకు "దేవుని ప్రేమించువాడు" అని అర్థం.

ఈ ఒక్క వ్యక్తిని ఆత్మీయంగా బలపర్చడానికి లూకా తీసికొన్న శ్రమ ఎంతైన శ్లాఘనీయం. వాస్తవంగా ఈ సువార్త రోమీయుడైన థెయొఫిలాకు వ్రాయబడినప్పటికిని, రోమీయులందరిని మరియు గ్రీసుదేశస్థులందరిని ఉద్దేశించి వ్రాయబడిందని చెప్పవచ్చును.

**4. ఉద్దేశము :** యేసుక్రీస్తు పరిపూర్ణుడైన మానవుడు అని నిరూపించేందుకే ఈ సువార్త వ్రాయబడింది. పరిపూర్ణుడైన మానవత్వమును గూర్చి రోమీయుల అభిప్రాయాలు గ్రీకుల అభిప్రాయాలు విభిన్నంగా ఉన్నాయి.

రోమీయులు పరిపాలనదక్షత, సైనిక ఘనత, ఆధిపత్యానికి ప్రాధాన్యతనిచ్చేవారు. గ్రీసు దేశస్థులు జ్ఞానమునకు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చినారు. ఉపదేశము ద్వారా, జ్ఞానాభ్యాసము ద్వారా ఒక వ్యక్తిని పరిపూర్ణునిగా చేయగలమని తలంచేవారు. వారి ఉద్దేశాలకు తగినట్లు లూకా యేసును పరిపూర్ణ మానవునిగా చిత్రీకరించాడు.

- మత్తయి యూదులకు క్రీస్తును రాజుగా చూపించాడు.
- మార్కు రోమీయులకు క్రీస్తును పరిచారకునిగా దేవుని సేవకునిగా చూపించాడు.
- లూకా గ్రీకులకు ఆయనను పరిపూర్ణమానవునిగా చూపించాడు.

**5. రచన కాలము :** లూకా సువార్త వ్రాయబడిన కాలమును గూర్చి వివిధ అభిప్రాయాలున్నాయి. కాని ఇది సుమారు క్రీ. శ. 53-68 మధ్య కాలంలో వ్రాయబడి ఉండవచ్చును.

**6.** మూల వాక్యము "నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్య కుమారుడు వచ్చెను" లూకా 19:10.

**7. లూకా సువార్త విశిష్ఠత :**

అ) లూకా సువార్తలో ఆత్మల రక్షణను గూర్చి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబడింది. అర్ధరాత్రివేళ వచ్చిన స్నేహితుడు (11 అధ్యా) పెండ్లి విందు (14 అధ్యా) తప్పిపోయి దొరికినవి (15 అధ్యా) సిలువ మీది దొంగ (23 అధ్యా) మొదలైన సంఘటనలు మనిషిని రక్షించేందుకు యేసు మానవుడుగుటలో వారి పట్ల ఆయనకు ఉన్న కనికర ప్రేమలను వెల్లడిస్తున్నవి. కనుక ఇది పాపుల కొరకైన సువార్త అని చెప్పవచ్చును. రక్షకుని గుణగణాలన్నీ ఈ సువార్తలో చూపిస్తూ, ఆయన రక్షకునిగా తగినవాడని లూకా నిరూపించాడు. మహిమగల దేవుడు, మానవ పరిధిలోనికి దిగిరావడం ఈ సువార్తలో చూస్తాము.

ఆ) ఇది భూమ్మీదనున్న వెలివేయబడినవారి సువార్త కూడ. లూకా ఒక్కడే మంచిసమరయుని గూర్చి (10:33) సుంకరిని గూర్చి (18:13) తప్పిపోయిన కుమారుని గూర్చి (15:11-24) జక్కయ్యను గూర్చి (19:2) సిలువపైన దొంగను గూర్చి (23:43) ప్రస్తావించడం గమనార్హం.

ఇ) లూకా సువార్తలో స్త్రీత్వం గూర్చి కూడా ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబడింది. స్త్రీల పట్ల యేసుక్రీస్తుకు

ఉన్న గౌరవభావమును గూర్చి, నాయీను విధవరాలి పట్ల గల జాలి మరియు పాపాత్మురాలైన స్త్రీపట్ల చూపిన కృపను గూర్చి పేర్కొనబడింది. (7:46; 8:3, 42; 9:38; 10:38-42; 11:27; 23:27).

ఈ) పరిశుద్ధాత్మ ప్రాముఖ్యతను గూర్చి ఈ సువార్తలో ఎక్కువగా చెప్పబడింది. మత్తయి సువార్తలో 12 సార్లు, మార్కు సువార్తలో దానికన్న తక్కువ పర్యాయాలు ప్రస్తావించబడింది, కాని లూకా సువార్తలో 19 సార్లు పరిశుద్ధాత్మను గూర్చి వ్రాయబడింది.

ఉ) లూకా సువార్తలో యేసు ప్రభువు చేసిన ప్రార్థనలు కూడ ఎక్కువగా వ్రాయబడ్డాయి. మానవునిగా యేసు దేవునిపై ఆధారపడుటను అవి సూచిస్తున్నాయి.

ఊ) ఇతర సువార్తలలో వ్రాయబడని 6 అద్భుతాలు, 18 ఉపమానాలు, 22 ప్రసంగాలు మరియు సంఘటనలు లూకా సువార్తలో వ్రాయబడ్డాయి.

ఎ) ఇతర సువార్తలలో క్రీస్తుజీవితము మరియు పరిచర్య, కాల క్రమమును అనుసరించి వ్రాయబడింది. లూకా సువార్తలో ఆయన ఉపదేశ క్రమమును అనుసరించి సంఘటనలు వ్రాయబడ్డాయి.

ఏ) లూకా ఒక వైద్యునిగా వైద్యపరమైన పదజాలమును ఉపయోగించడం గమనార్హం.

## B. గ్రంథ విభజన :

### I. పరిపూర్ణుడైన మానవుని జన్మ మరియు ఆయన కుటుంబము (1-3 అధ్యా) :

1. బాప్తిస్మమిచ్చు యోహాను మరియు యేసు జన్మను గూర్చిన ప్రకటన — 1 అధ్యా
2. యేసు జన్మ, ఆయన స్వీకరించబడుట; సున్నతి పొందుట మరియు 12 సం॥ ప్రాయంలో యెరూషలేముకు వెళ్ళుట — 2 అధ్యా
3. బాప్తిస్మమిచ్చు యోహాను పరిచర్య, యేసు బాప్తిస్మం మరియు వంశావళి — 3 అధ్యా

### II. పరిపూర్ణుడైన మానవుని పరీక్ష; స్వంత పట్టణస్తుల తృణీకారం — 4 అధ్యా

1. యేసు శోధించబడుట (4:1-13)
2. యేసు గలిలయ మరియు నజరేతుకు తిరిగివచ్చుట, తన పట్టణస్తులచే తృణీకరించబడుట (4:14-30).
3. యేసు కపెర్నహూమును ప్రధాన కేంద్రముగా చేసికొనుట (4:31-44).

### III.పరిపూర్ణుడైన మానవుడు గలిలయలో చేసిన పరిచర్య (5-9 అధ్యా)

1. యేసు రెండవసారి శిష్యులను పిలుచుట క్రొత్త వస్త్రం, క్రొత్త తిత్తులను గూర్చిన ఉపమానం — 5 అధ్యా
2. యేసు 12 మందిని ఏర్పరచుకొనుట, మైదానములో చేసిన ప్రసంగం — 6 అధ్యా
3. స్వస్థతలు, నాయీను విధవరాలి కుమారుణ్ణి బ్రతికించుట బాప్తిస్మమిచ్చు యోహానును అభినందించుట, పరిసయ్యుని ఇంటిలో విందు, ఇద్దరు ఋణస్తులను గూర్చిన ఉపమానము — 7 అధ్యా



4. యేసు చెప్పి ఉపమానాలు, స్వస్థతలు, తుపానును గద్దించుట దయ్యాలను వెళ్ళగొట్టుట, యాయీరు కుమార్తెను బ్రతికించుట — 8 అధ్యా
5. యేసు 12 మందికి ఆజ్ఞాపించి పంపుట; 5000 మందికి ఆహారం పెట్టుట, తన మరణ పునరుత్థానాలను గూర్చి ప్రకటించుట, రూపాంతరము, యెరూషలేమునకు అభిముఖుడగుట; తన శిష్యులను పరీక్షించుట — 9 అధ్యా

### IV. పరిపూర్ణుడైన మానవుడు యెరూషలేముకు వెళ్ళేమార్గములో చేసిన పరిచర్య (10-18 అధ్యా)

1. యేసు 70 మందిని పంపించుట, కొరాజీనా, బేత్సయిదా మరియు కపెర్నహూముపై తీర్పును ప్రకటించుట, మంచిసమరయుని ఉపమానము, మరియ మార్తల గృహమునకు వెళ్ళుట — 10 అధ్యా
2. పట్టువిడువని స్నేహితుడు మరియు మంచి తండ్రిని గూర్చిన ఉపమానాల ద్వారా శిష్యులకు ప్రార్థనను గూర్చి నేర్పించుట, యేసుపై బయల్జెబూబు వలన దయ్యాలను వెళ్ళగొడుతున్నాడన్న నేరం మోపబడుట, యోనాను గూర్చిన సూచన పరిసయ్యులను ఖండించుట — 11 అధ్యా
3. యేసు పరిసయ్యుల పులిపిండిని గూర్చి హెచ్చరించుట, బుద్ధిహీనుడైన ధనవంతుని గూర్చిన ఉపమానము, నమ్మకమైన బుద్ధిగల గృహ నిర్వాహకుని దృష్టాంతం ద్వారా క్రీస్తు రాకడను గూర్చి చెప్పుట. — 12 అధ్యా
4. తీర్పు తీర్చవద్దని మారుమనస్సు పొందాలని యేసు బోధించుట, ఫలింపని అంజూరపు చెట్టు, ఆవగింజ మరియు పులిపిండిని గూర్చిన ఉపమానాలు - యెరూషలేమును గూర్చి విలపించుట — 13 అధ్యా
5. యేసు పరిసయ్యుని యింటికి వెళ్ళుట, అతిథిని గూర్చిన ఉపమానం, గొప్పవిందు, గోపురము కట్టే వ్యక్తి మరియు యుద్ధానికి వెళ్ళే రాజు సిద్ధపాటు, నిస్సారమైన ఉప్పు — 14 అధ్యా
6. తప్పిపోయిన గొఱ్ఱె, పోగొట్టుకొన్న నాణెము, తప్పిపోయిన కుమారుని గూర్చిన ఉపమానాలు — 15 అధ్యా
7. అన్యాయస్థుడైన గృహనిర్వాహకుని ఉపమానం, ధనాపేక్షగల పరిసయ్యులకు జవాబిచ్చుట, విడాకులను గూర్చి మాట్లాడుట, ధనవంతుడు మరియు లాజరును గూర్చిన ఉదాంతం — 16 అధ్యా

8. యేసు క్షమాపణను గూర్చి శిష్యులకు బోధించుట, పది మంది కుష్ఠరోగులను స్వస్థపరచుట, రాజ్యము యొక్క ఆత్మీయ స్వభావమును గూర్చి, తన రెండవ రాకడను గూర్చి వివరించుట 17 అధ్యా
9. ప్రార్థనను గూర్చి యేసు రెండు ఉపమానాలు చెప్పుట చిన్న పిల్లలను ఆశీర్వదించుట, ధనవంతుడైన యౌవనస్తుడు, యేసు తన మరణమును గూర్చి మరోసారి చెప్పుట, యెరికో మార్గములో గ్రుడ్డివానిని స్వస్థపరచుట 18 అధ్యా

**V. పరిపూర్ణుడైన మానవుడు యెరికో మరియు యెరూషలేములో చేసిన పరిచర్య (19-21 అధ్యా)**

1. యేసు యెరికోకు వెళ్ళుట, జక్కయ్య మార్పు, మీనాలను గూర్చిన ఉపమానము, యెరూషలేము ప్రవేశం, దేవాలయాన్ని శుద్ధి చేయుట, యెరూషలేమును గూర్చి ఏడ్చుట 19 అధ్యా
2. యేసు అధికారం ప్రశ్నించబడుట, ద్రాక్షతోటను గూర్చిన ఉపమానము, కైసరుకు పన్నిచ్చుట మరియు పునరుత్థానమును గూర్చి ప్రశ్నలు 20 అధ్యా
3. పేదవిధవరాలి కానుక, జరుగబోవు సంగతులను గూర్చి ఒలీవలకొండ మీద ప్రసంగం 21 అధ్యా

**VI. పరిపూర్ణుడైన మానవుడు అప్పగించబడుట, తీర్పు మరియు ఆయన మరణము (22-23 అధ్యా)**

1. యేసును అప్పగించడానికి, యూదా ప్రధానయాజకులతో కుట్రపన్నుట, ప్రభువు చివరి పస్కా భోజనం, గెత్సెమనే తోటకు వెళ్ళుట, యూదాచే అప్పగించబడి సన్హెద్రిన్ సభ ఎదుటికి తీసికొనిపోబడుట 22 అధ్యా
2. పిలాతు మరియు హేరోదు ఎదుట యేసుకు తీర్పు తీర్చబడుట; సిలువ మరణం మరియు భూస్థాపన 23 అధ్యా

**VII. పరిపూర్ణుడైన మానవుని పురరుత్థానం మరియు ఆరోహణం** 24 అధ్యా

1. యేసు సమాధిని గెలిచి లేచుట (24:1-12).
2. ఎమ్మాయి మార్గములో శిష్యులకు కనిపించుట (24:13-34).
3. పదకొండు మంది శిష్యులకు ప్రత్యక్షపరచుకొనుట (24:35-48).
4. పరిశుద్ధాత్మను వాగ్దానం చేయుట, ఆరోహణమగుట (24:49-53).

## C. అంశాలవారిగా సంగ్రహ సమీక్ష :

### I. పరిపూర్ణ మానవుడైన యేసు జన్మ మరియు బాల్యము :

ఈ చక్కని పుస్తకం ప్రారంభం భావగర్భితమైనది. మత్తయి, యేసును రాజుగా దావీదు



కుమారునిగా నిరూపించే వంశావళితో తన సువార్తను ప్రారంభించాడు. మార్కు ఆయనను దేవుని సేవకునిగా చూపిస్తూ ఆరంభించాడు. యోహాను ఆయన దేవుని కుమారుడని, ఈ లోకానికి సంబంధించినవాడు కాదని తెలియజేస్తు ఆయనను ఆదియందున్న వాక్యముగా పరిచయం చేస్తూ తన సువార్తను ఆరంభించాడు. కాని లూకా అయితే ఆయనను మానవులందరితో గుర్తింపు కలిగిన వానిగా చూపిస్తూ ఆయన వంశావళిని ఆదాముతో ప్రారంభించాడు. మానవజాతి అంతటికి శిరస్సైన ఆయన పరిపూర్ణమైనవాడు అని ఆయన జన్మవృత్తాంతం ద్వారా నిరూపించాడు.

దానికి ముందుగా, ఉన్న పరిస్థితులను లూకా కొంత వివరించాడు. ఎందుచేతనంటే క్రీస్తు మొదటి రాకడకు మరియు రెండవ రాకడకు ముందు ఉన్న పరిస్థితులు ఒకే విధంగా ఉన్నట్లు గమనించగలము. ఇశ్రాయేలు జాతి లోకస్తుల వలన నిందించబడుతున్న సమయం అది. ప్రజలలో దైవభీతి తగ్గిపోయింది.

లూకా తన సువార్తలో, క్రీస్తుకు ముందు మరియు ఆయన జన్మ సమయములోని రాజకీయ పరిస్థితులను కూడ వివరించడం గమనార్హం. ఈ చరిత్రను తెలిసికొని ఉండడం ఎంతైన అవసరం.

**1. యూదయను పరిపాలించిన హేరోదులు :**

**అ)** లూకా 1:5 లో పేర్కొనబడిన హేరోదు మహాహేరోదు అని పిలువబడ్డాడు. ఇతడు హేరోదు వంశ పితామహుడు. రోమా ప్రభుత్వము క్రింద సామంతరాజుగా యూదయను ఏలినవాడు. అతడు ఎంత సామర్థ్యుడో అంత దుష్టుడు. క్రీస్తు పుట్టాక రెండు సంవత్సరాలలోపు, శిశువులందరినీ చంపించినవాడు ఇతడే. ప్రభువు జీవించిన కాలంలోని దేవాలయాన్ని యూదులను తృప్తిపరచేందుకు ఇతడే కట్టించాడు. బాలుడైన యేసు ఐగుప్తులో ఉన్నప్పుడు ఇతడు చనిపోయాడు.

**ఆ) ఆర్కెలియస్ :** ఇతడు హేరోదు టెట్రార్కని కూడ పిలువబడ్డాడు. (మత్తయి 14:1; లూకా 3:9). బాప్తిస్మమిచ్చు యోహానును శిరచ్ఛేదం చేయించినవాడు, పిలాతుతో కలసి యేసు మరణం విషయం సమ్మతించినవాడు ఇతడే. (లూకా 23:7; అపొ.కా 4:27).

**ఈ) హేరోదు అగ్రిప్ప :** ఇతడు మహాహేరోదు మనమడు. యూదయను సామంతరాజుగా పరిపాలించాడు. సంఘమును హింసించినవాడు, యాకోబును ఖడ్గముతో చంపించినవాడు ఇతడే (అపొ. 12:1-4) అపొ. 12:23 లో ఇతని మరణమును గూర్చి వ్రాయబడింది.

**ఉ) హేరోదు అగ్రిప్ప :** ఇతని వద్దకు అపొస్తలుడైన పౌలు న్యాయతీర్పు నిమిత్తం తీసికొని పోబడ్డాడు. (అపొ. 25:10,17,26). ఇతడు అపొ. 12:1లో వ్రాయబడిన హేరోదు కుమారుడు. అనగా మహాహేరోదు మునిమనవడు. వీరందరు రోమా ప్రభుత్వం పక్షంగా గలిలయకు సామంతరాజులుగా నియమించబడ్డారు.

**2. బాప్తిస్మమిచ్చు యోహాను :**

**A. జన్మ :** మరే సువార్తలో లేనంత వివరముగా, యేసు ప్రభువు కొరకు మార్గమును సరాళము చేసిన యోహానును గూర్చి లూకా సువార్తలో వివరించబడింది. అతని తల్లిదండ్రుల వివరాలు (1:5-7; I ది.వృ. 24:10; నెహె 12:17) యోహాను జన్మను గూర్చి ప్రభువు దూత ప్రకటించుట (1:8-23)ను గూర్చి వ్రాయబడింది. అతనికి ఏ పేరు పెట్టాలో ముందుగానే చెప్పబడింది (1:13).

**B. బాప్తిస్మమిచ్చు యోహాను ప్రభువు దృష్టిలో గొప్పవాడు :** అందుకు కొన్ని కారణాలను గమనిద్దాం.

అ) ప్రవక్తలందరు మెస్సీయా రాకడను గూర్చి ప్రవచించారుగాని యోహాను యేసుక్రీస్తును లోకానికి ప్రత్యక్షంగా వెల్లడిచేసాడు. (యోహా 1:29).

ఆ) అతడు యేసు ప్రభువుకు మార్గమును సిద్ధపరచు దూతగా వచ్చాడు. (7:27; యెష 40:3).

ఇ) అతని జీవిత విధానం ఇతరుల కంటె భిన్నమైనది. (1:80; మత్త 3:4)

ఈ) అతని జీవిత ఉద్దేశం ప్రభువును హెచ్చించుట. (యోహా 3:30). కనుక దేవుని దృష్టిలో హెచ్చించబడ్డాడు.

ఉ) దేవుని నీతి కొరకు పాపమును ఖండించినవాడు. (9:7-9). యోహాను గొప్పతనమును గూర్చి యేసు ప్రభువే స్వయంగా బహిరంగముగా ప్రకటించాడు. (7:28).

**C. బాప్తిస్మమిచ్చు యోహాను పరిచర్య :**

1. ఇశ్రాయేలీయులలో అనేకులను దేవుని వైపు త్రిప్పుట (1:16). దేవుని మరచి తిరుగులాడుతున్న ఇశ్రాయేలు జనాంగమంతటిని తన బోధ వలన యేసువైపుకు ఆకర్శించాడు. వారిని ఐక్యపరచే బాధ్యత వహించాడు.
2. ప్రభువు కొరకు ఆయత్తపడిన ప్రజలను సిద్ధపరచుట (1:17). నిర్దేవులైనవారి మనస్సులను త్రిప్పడం మాత్రమే కాకుండ ప్రభువు కొరకు సిద్ధపడి ఉన్న కొద్దిపాటి శేషము ఆయనను అంగీకరించేలా సిద్ధం చేయడమే యోహాను పరిచర్య.

   ఈనాటి దేవుని సేవకుల, విశ్వాసుల పరిచర్య కూడా ఈ విధంగానే ఉండాలి. నశిస్తున్న ఆత్మలను రక్షించాలి, రక్షించబడినవారిని క్రీస్తు రాకడ కొరకు పరిశుద్ధ జీవితములో సిద్ధపర్చాలి.
3. క్రీస్తు బోధలను, అనగా మారుమనస్సు, పశ్చాత్తాపము, విశ్వాసము, బాప్తిస్మము మొదలైన అంశాలను ప్రజలకు ముందుగానే పరిచయం చేసాడు.

   ఈ పరిచర్య అంతటిని చేయడానికి యోహాను దైవాత్మ శక్తిని పొందాడు. (1:17; మలా 4:5,6; మత్త 17:12) తల్లిగర్భములో ఉన్నప్పుడే అతడు పరిశుద్ధాత్మతో నింపబడ్డాడు (1:41). అతని జన్మ మరియు పరిచర్య వలన అనేకులు సంతోషించారు (1:17; యోహా 5:35). మన జీవితాలు, పరిచర్య అలా ఉన్నాయో లేదో పరీక్షించుకోవాలి.



**3. యేసు జన్మ :**

యేసుక్రీస్తు పరిపూర్ణుడైన మానవునిగా ఈలోకానికి రావలసి వచ్చినా, మనుష్య కుమారునిగా వచ్చిన క్రీస్తుకు మనుష్యుల కుమారులము, కుమార్తెలునైన మనకు పూర్తిగా వ్యత్యాసం ఉన్నది. అలాగే దేవుని కుమారుడైన క్రీస్తుకు, దేవుని కుమారులము, కుమార్తెలునైన మనకు మధ్య గొప్ప వ్యత్యాసం ఉన్నది. ఈ విషయాన్ని లూకా 1:35 లో గబ్రియేలు దూత స్పష్టం చేసాడు. "పుట్టబోవు శిశువు పరిశుద్ధుడు." ఇది క్రీస్తు మానవత్వానికి మనకు మధ్యగల వ్యత్యాసాన్ని తెలియజేస్తున్నది. మన మానవ స్వభావం అపవిత్రమైనది. (యెష 64:6; కీర్త 51:5).

లూకా తన సువార్త ముఖ్యాంశాన్ని దృష్టిలో ఉంచుకొని, యేసు అద్భుత జన్మను గూర్చిన వివరాలన్నీ ఇచ్చాడు. ఈలోక సృష్టికర్తయైన క్రీస్తు లోకంలోని ఇతర మానవుల రూపంలో ఈ లోకానికి వచ్చాడు. ఇది మర్మాలలోకెల్ల గొప్ప మర్మము.

లూకా సువార్త మొదటి రెండు అధ్యాయాలలోని కీర్తనలు క్రైస్తవ సంఘానికి సుపరిచితమైనవి (1:46-55; 1:68-79; 2:8-14).

2వ అధ్యాయంలోని ప్రజాసంఖ్యలో యోసేపు మరియలు తమ పేర్లను నమోదు చేసికోవడం, యేసు మానవులందరితో సహానుభవంగలవాడని నిరూపిస్తున్నది. ప్రవక్తలు ఆయన జన్మను గూర్చి చెప్పినవి (మీకా 5:2) నెరవేర్చబడడానికి దేవుడే జోక్యం చేసికొన్నాడు. (2:5) అందుకు దేవుడు అన్య అధికారులను ఎన్నుకోవడం ఆశ్చర్యం. దేవుడు తన కార్యాలను నెరవేర్చడానికి ఎవరి హృదయాన్నైనా త్రిప్పగల సమర్థుడు.

యేసు బాల్యమును గూర్చి లూకా ఒక్కడే స్పష్టంగా వ్రాసాడు. బాలునిగా యేసు స్వాభావికంగా ఎదిగాడు (2:40,52) యోసేపు మరియలకు లోబడ్డాడు. (2:51) దేవుని ఆజ్ఞలకు విధేయత చూపించాడు. యేసు యూదా బాలురందరిలాగే తన పండ్రెండవ యేట యెరూషలేము దేవాలయానికి వెళ్ళినట్లు లూకా ఒక్కడే వ్రాసాడు.

ఆ సందర్భంలో ఆయన అసాధారణ జ్ఞానం వెల్లడించబడింది. అక్కడే ప్రప్రథమంగా ఆయన ఈ లోకానికి వచ్చిన ఉద్దేశాన్ని గూర్చి ప్రస్తావించాడు (2:49). ఆయన దైవత్వాన్ని గూర్చిన స్వయం సాక్ష్యమిది.

## II. పరిపూర్ణుడైన మానవునిగా యేసు పరిచర్య :

యేసు బహిరంగ సేవను ప్రారంభించినప్పుడు ఆయన వయస్సు 30 సంవత్సరాలు అని లూకా సువార్తలో మాత్రమే వ్రాయబడింది (3:23). ఈ సువార్తలో యేసు వంశావళి దావీదు కుమారుడైన సొలొమోను ద్వారా కాకుండ నాతాను ద్వారా కొనసాగించబడడం గమనార్హం. (II సమూ 7:12, 13; రోమా 1:3; అపొ 2:30, 31). ఆయన శరీర రీత్యా దావీదు వంశానికి చెందినవాడైయుండాలి, మరియు స్త్రీ సంతానముగా ఉండాలి గనుక

దావీదుకు నాతాను ద్వారా పుట్టిన వంశానికి చెందిన మరియకు జన్మించాడు. ఆయన తండ్రిగా పిలువబడిన యోసేపు సొలొమోను ద్వారా పుట్టిన దావీదు వంశస్తుడు.

యేసు పరిచర్యలో పరిశుద్ధాత్మ కార్యమును లూకా స్పష్టంగా వర్ణించాడు (4:1,4).

**1) మానవుడైన క్రీస్తు ఎదుర్కొన్న శోధన :**

యేసు క్రీస్తు ఒక మానవునిగా అన్ని విషయాలలో మనవలెనే శోధించబడ్డాడు (హెబ్రీ 4:15). పరిపూర్ణ మానవునిగా సృజించబడిన మొదటి ఆదామును సాతాను సవాలు చేసినట్లే కడపటి ఆదాము అయిన క్రీస్తును సవాలు చేసాడు. అయితే భూమి మీదనున్న మనుష్య కుమారునికి పరలోకంలోని తండ్రితోగల సంబంధాన్ని త్రెంచివేయడానికి సాతానుచేసిన ప్రయత్నం విఫలమైంది. క్రీస్తు నందు విశ్వాసముంచి పరిపూర్ణతలోనికి ఎదుగుతున్న ప్రతి ఒక్కరు అట్టి విజయవంతమైన జీవితాన్ని కలిగి ఉంటారు. యేసువలె పరిశుద్ధాత్మ పూర్ణులగుట వలననే అది సాధ్యమౌతుంది.

యేసు సాతానుకు లొంగిపోతాడా లేదా అని పరీక్షించడానికి శోధించబడలేదు గాని వాడు ఆయనను ఏ విధంగాను లోబరచుకోలేడని నిరూపించడానికి శోధించబడ్డాడు. ఈ శోధన ద్వారా ఆయన పరిపూర్ణమానవత్వం వెల్లడించబడింది.

యేసుక్రీస్తు పరిచర్య ముఖ్యాంశం "కనికరము". లూకా యేసుక్రీస్తును మానవుల ప్రతి అక్కరకు సరిపోయినవానిగా, మనతో సహానుభవము గలవానిగా చిత్రీకరించాడు. ఆయన యూదుల మధ్య పరిచర్య చేసినా, మానవాళి అంతటికి పరిచర్యచేయాలని, వారి అక్కరలు తీర్చాలన్న ఆయన ఉద్దేశం స్పష్టమౌతున్నది. ఆయన జ్ఞాని (4:14, 15, 32) ఉపదేశకులందరిలో ఉత్తమోత్తముడు (5:30, 39; 6 అధ్యా; 9:25-37; 22:2-8). శక్తిమంతుడైన మానవుడు. (4:33-37; 5,8 అధ్యా; 9:37-43) ప్రార్థనాపరుడు. క్లిష్టపరిస్థితులలో ఒక మానవునిగా దేవునిపై ఆధారపడ్డాడు (3:21; 5:16; 6:12; 9:18-29; 11:1,2; 9:29). ఆయన ఒక సాంఘీక పురుషుడు. (7:36; 11:37; 14:1; 19:7).

క్రీస్తు మానవుల యెడల పరిపూర్ణ సానుభూతిగలవాడు, పడిపోయినవారి పట్ల (5:27-39; 7:36, 37) దుఃఖితుల పట్ల (7:36,37) నిరుత్సాహితుల పట్ల (7:19) వ్యాధిగ్రస్తుల పట్ల (4:38-41; 5:12; 7 అధ్యా) కనికరం చూపించాడు.

**2) పరిపూర్ణమైన మానవుడు గలిలయలో చేసిన పరిచర్య (4:14-9:48).**

**అ) ఆయన తృణీకరించబడుట :** యేసు అపవాదిచేత శోధింపబడిన తరువాత ఆయన పెరిగిన నజరేతుకువచ్చాడు. ఆయన వాడుకచొప్పున విశ్రాంతిదినమున సమాజమందిరానికి వెళ్ళాడు (4:16) తాను పెరిగిన స్థలంలో, తన జీవితంలోని ప్రాముఖ్యమైన ఉద్దేశాన్ని వారికి తెలియజేసాడు. ఆయన ప్రవచనాత్మక పురుషుడు అని ఈ లేఖనభాగం నిరూపిస్తున్నది. సమాజ మందిరంలో ఆయన యెషయా 61:2 నుండి చదివిన భాగము, ఆయన దేవునిచేత



అభిషేకించబడి ఆత్మీయ అర్హతలతో పంపించబడ్డాడని, ఆయనే మెస్సీయా అని వెల్లడిస్తున్నది. ఈ వాక్యభాగం భూమి మీద ఆయన పరిచర్య లక్ష్యమునంతా సూచిస్తున్నది.

ఆయన పరిచర్య ప్రారంభంలోనే, ఆయన స్వంత పట్టణస్తులే ఆయనను తృణీకరించారు. ఇతడు యోసేపు కుమారుడు కాడా ? అన్న మాట తృణీకారానికి మొదటి సూచన. ఆయన చదివిన వాక్య భాగాన్ని ప్రజలు గ్రహింపలేదు. ఆయన నజరేతును గూర్చి చెప్పిన విషయం వారి హృదయాన్ని గాయపర్చింది. ఎందుచేతనంటే వారు నజరేతును గూర్చి అతిశయించారు.

యేసు ప్రభువు అన్యులను, అనగా సారెపతు విధవరాలు మరియు సిరివాడైన నయమానును దృష్టాంతంగా చెప్పడం, మరియు మెస్సీయ అన్యుల కొరకు కూడ పంపిచబడ్డాన్న సత్యాన్ని వారు జీర్ణించుకోలేక పోయారు (4:24-20). యూదులు బబులోను చెరలో ఉన్నప్పుడు వారిచే పొందిన శ్రమలే వారు అన్యులను ద్వేషించడానికి ప్రధాన కారణం. వారిని దేవునికి శత్రువులుగా, శిక్షకే పాత్రులుగా ఎంచారు. దేవుని రాజ్యంలో చేర్చబడడానికి యూదులకు మరియు అన్యులకు కూడ ఒకే షరతు విధించుట ద్వారా యేసు వీరిద్దరి మధ్య అడ్డుగోడలను పగుల గొట్టినట్లు లూకా చూపించాడు. మారుమనస్సు మరియు విశ్వాసం ద్వారా అందరూ దేవుని రాజ్యానికి అర్హులు కాగలుగుతారు. అయితే దేవుని కృప కేవలం యూదులకే చెందుతుంది అని నమ్మిన ఆ పట్టణస్తులు యేసును చంపాలని ప్రయత్నించారు. (4:29-31). ఆయన తప్పించుకొని అక్కడి నుండి వెళ్ళిపోయాడు. కొన్ని నెలల తరువాత మళ్ళీ నజరేతుకు వెళ్ళినట్లు మత్తయి 13:54 ద్వారా తెలుస్తుంది. కాని దాని వల్ల కూడ అంతగా ఫలితం కనిపించదు.

**ఆ) ఆయన బోధ :** క్రీస్తు మనుష్య కుమారునిగా, మనుష్యులందరి అవసరాలను గుర్తించాడు. మత్తయి 5-7 అధ్యాయాలలోని కొండమీది ప్రసంగమునంతా లూకా సంక్షిప్తపరచి 6వ అధ్యాయంలో వివరించాడు. 5వ అధ్యాయంలోని రెండు ఉపమానములు (5:36-39) శాస్త్రులకు పరిసయ్యులకు గిట్టలేదు. వారు తమ ఆచారాలను మానుకోడానికి సమ్మతించలేదు గనుక యేసు చెప్పే నూతన ఆధ్యాత్మిక ఉపదేశాన్ని అంగీకరించలేక పోయారు. యేసు ప్రభువు నూతన సత్యాలను నూతనపరచబడిన ఆత్మలలోనే నింపుతాడు.

దేవుని సేవకులు, సంఘము దిన దినము నూతనపరచుకొంటూ, దేవుని నుండి నూతన వర్తమానాలు పొందాలి. అప్పుడే నూతన ఆత్మలను సంపాదించగలుగుతారు. ఆచారాలతో కూడిన నామకార్థమైన సంఘము దేవునిచే విసర్జించబడుతుంది.

**ఇ) శిష్యులను ఏర్పరచుకొనుట (6:12-16) :** యేసు శిష్యులను ఏర్పాటు చేయకముందు ప్రార్థనలో సమయం గడిపాడు (6:12) ఆయన పామరులను పిలిచాడు (I కొరి 1:26-29) అయితే సోమరులను, నిష్ప్రయోజకులను పిలువలేదు. పనిచేస్తూ ఉన్నవారిని (5:2) విశ్వసించిన వారినే పిలిచాడు (5:10). వీరందరూ లోకము నుండి ప్రత్యేకించబడి క్రీస్తు కొరకు సమస్తమును విడచి పెట్టినవారు (5:11) వేర్వేరు వృత్తులకు చెందినవారిని, వేర్వేరు

మనస్తత్వాలను గలవారిని తన వెంటబెట్టుకొని శిక్షణనిచ్చాడు. వారిలోని ధర్మశాస్త్రానుసారమైన మనస్సును తీసివేసి, కృపాసంబంధమైన మనస్సును (6:1-11), శరీరానుసారమైన మనస్సును తీసివేసి ఆత్మానుసారమైన మనస్సును ప్రవేశపెట్టాడు. (9:46-48; 24-30) శిష్యుని అర్హతను గూర్చి లూకా 6:39, 40లో స్పష్టంగా తెలియజేస్తూ 6:46-49లోని ఉపమానాన్ని వివరించాడు.

**ఈ) యేసు పరిచర్యలో స్త్రీల పాత్ర (8:2,3) :** యేసు జన్మ మరియు పరిచర్యలోను స్త్రీల ప్రధాన పాత్రను గూర్చి లూకా ఎక్కువగా వివరించాడు. ఎలీసబెతు, మరియు (1,2 అధ్యా) ప్రవక్త్రియైన అన్న (2 అధ్యా) ఆతిథ్యమిచ్చిన మరియు మార్తలు (10:38-42) ఆయన ద్వారా రక్షించబడిన పాపాత్మురాలు (7:36-40) స్వస్థతపొందిన స్త్రీలు (8:43-48, 13:10-17). తన కుమారుణ్ణి తిరిగి పొందిన నాయీను విధవరాలు (7:11-17) తమ సంపదలతో పరిచర్య చేసిన స్త్రీలు (8:1-3) పోగొట్టుకొన్న నాణెమును వెదకికనుగొన్న స్త్రీ (15:8-10) విసుగక ప్రార్థించిన విధవరాలు (18:1-7) సమస్తమును సమర్పించిన విధవరాలు (21:14) యేసును గూర్చి విలపించిన స్త్రీలు (23:27,28) యేసు మరణ సమయంలో ఉన్న స్త్రీలు (23:49) పునరుత్థాన సందర్భంలో ఉన్న స్త్రీలు (24:1-12).

**ఉ) యేసు శిష్యులను పంపించుట (9:1-6) :** యేసు తన శిష్యులను నశిస్తున్న ఇశ్రాయేలు ఇంటివారియొద్దకే పంపించినట్లు మత్తయి వ్రాసాడు. కాని లూకా ఆయన వారిని ప్రతి ఊరికి ప్రతి చోటికి పంపించినట్లు వ్రాసాడు (10:1) యొర్దాను తూర్పు ప్రాంతంలో యేసు చేసిన పరిచర్య అంతా అన్యుల మధ్యనే. ఆయన ఎక్కడికి వెళ్ళినా గొప్ప జన సమూహం ఆయనను వెంబడించింది. ఆయన వారి కొరకు తన్నుతాను సమర్పించుకొన్నాడు (6:19) మన పరిచర్య కూడ ఆవిధంగా ఉండాలి. ఆయన పాపులకు సుంకరులకు స్నేహితుడని పిలువబడ్డాడు (7:34) వారిని రక్షించడానికే ఆయన వచ్చాడు (19:10).

**3. పరిపూర్ణుడైన మానవుడు సమరయ మరియు పెరయలో చేసిన పరిచర్య (10-18)**

అన్యుల మధ్య ఆరంభించిన ఈ పరిచర్య ఆయన తుదియాత్రకు ప్రారంభం, దానికి ముందే అనగా 9వ అధ్యాయంలో రూపాంతర అనుభవం తరువాత ఆయన మరణ పునరుత్థానాలను గూర్చిన ప్రస్తావన ప్రారంభమైనది.

లూకా మొదటి తొమ్మిది అధ్యాయాలలో యేసు పట్ల ప్రజల తృణీకారం ఎక్కువగా కనిపిస్తుంది. 9వ అధ్యాయం అనంతరం మతనాయకులకు యేసు పట్లగల తృణీకారం గూర్చి వ్రాయబడింది. ఈ ప్రధాన భాగంలో అనగా 10-19 అధ్యాయాలలో యేసుక్రీస్తు పలు వ్యక్తులను దర్శించినట్లు వ్రాయబడింది.

**అ) 70 మందిని ఏర్పరచుట (10:1-24) :** ఆయన 70 మందిని ఏర్పరచి ఇద్దరిద్దరినిగా సేవకు పంపించాడు. వారికి సువార్త సేవ అవసరతను గూర్చి. ప్రజల లక్షణాలను గూర్చి, అందుకువారి సిద్ధపాటును గూర్చి, వారు ప్రకటించాల్సిన సందేశాన్ని గూర్చి, వారి



బస మరియు భోజనమును గూర్చి స్పష్టంగా వివరించాడు. 10:10-16లో కొరాజీనా, బేత్సయిదా మరియు కపెర్నహూము పట్టణాలపై తీర్పును ప్రకటించాడు. 10:17-24 వరకు 70 మంది తమ సేవను గూర్చి చెప్పిన నివేదిక మరియు యేసు వారికి ఇచ్చిన ఆధిక్యతను గూర్చి వ్రాయబడింది. వారిని బట్టి ప్రభువు దేవుణ్ణి స్తుతించాడు.

**ఆ) పొరుగువారిని ప్రేమించుట (10:25-28) :** యేసు ప్రభువును శోధించడానికి ధర్మశాస్త్రోపదేశకుడు వేసిన ప్రశ్నకు జవాబుగా మంచి సమరయుని ఉపమానాన్ని చెప్పి, ప్రేమ అనే ఆజ్ఞ ప్రాముఖ్యతను వివరించాడు. "నిన్నువలె నీ పొరుగువాని ప్రేమింపవలెను" అన్న ఆజ్ఞ లేఖనాలలో 8 సార్లు వ్రాయబడింది. ఇది రెండవ ప్రధానమైన ఆజ్ఞ. కాని యాకోబు, మరియు పౌలు ఆజ్ఞలన్నీ దీనిలోనే సంక్షేపముగా ఇమిడి ఉన్నాయని వ్రాసారు. (యాకోబు 2:8; గల 5:4; రోమా 13:9).

10:3-42 లో బేతనియలోని మరియు, మార్తలతో ప్రభువు సహవాసం, వారి మధ్య జరిగిన సంభాషణ ప్రతి విశ్వాసి జీవితానికి ఎంతో ప్రాముఖ్యమైనది. దేవునితో వ్యక్తిగతంగా గడిపే సమయం అన్నిటి కంటె ఉత్తమమైనది.

**ఇ) ప్రార్థన ప్రాముఖ్యత (11:1-13) :** ప్రార్థన ప్రాముఖ్యతను తెలుపుతూ ప్రభువు, మాదిరి ప్రార్థనను చెప్పడమే కాకుండ (1-4) పట్టుదలతో కూడిన ప్రార్థనను (11:5-10) తండ్రి నుండి శ్రేష్ఠమైన వాటిని పొందే విధానాన్ని (11:11-13) తెలియజేసాడు.

యేసు బయల్జెబూలు వలన దయ్యాలను వెళ్ళగొడుతున్నాడన్న నేరారోపణకు (11:13-23) సూచక క్రియను అడిగిన వారికి సమాధానం చెప్పడం (11:29-32) పరిసయ్యులను ధర్మశాస్త్రోపదేశకులను గద్దించడం. (11:39-52). వారు ఆయనపై పగపట్టడం ఈ అధ్యాయంలోని ప్రధానాంశాలు.

**ఈ) ప్రధాన బోధనాంశాలు :** లూకా 12వ అధ్యాయంలో 46 హితోపదేశాలున్నాయి. ఈ సందర్భంగా చెప్పబడిన బుద్ధిహీనుడైన ధనవంతుడు (12:13-21) మెలకువగల దాసుని ఉపమానాలు ముఖ్యమైనవి. (12:35-48).

మారుమనస్సు ఆవశ్యకత (13:1-9, 22-30) దేవుని రాజ్యమును గూర్చి ఉపమానాలు (13:18-21) తగ్గింపు (14:7-11) పెండ్లి విందు ఉపమానం (14:15-24) శిష్యత్వపు క్రయము (14:25-35; 18:28-34) తప్పిపోయి దొరికినవి (15 అధ్యా) ధనాపేక్ష (16:1-18; 18:18-27) ప్రార్థనను గూర్చిన ఉపమానాలు (18:1-4) ఆయన ప్రధాన బోధనాంశాలు.

**4. పరిపూర్ణుడైన మానవుడు యెరికో మరియు యెరూషలేములో చేసిన పరిచర్య (19-21 అధ్యా) :**

ఈ భాగంలో లూకా, యేసు రాజుగా యెరూషలేము పట్టణములో జయోత్సాహముతో ప్రవేశించి, దేవాలయాన్ని శుద్ధిచేయటతో ప్రారంభించి, ఆయన పరిచర్య నెరవేర్పును

తెలియజేసాడు. మత నాయకులు ఆయనను పట్టుకోడానికి కుట్ర పన్నుతూ ఉండగా సామాన్య ప్రజలు ఆయనను స్వీకరించాలో, తిర్కరించాలో తెలియని సందిగ్ధంలో ఉండిపోయారు. మతాధికారులు ఆయనపై ఏ నేరము మోపాలన్న కుట్రతో పదే పదే ఆయన అధికారాన్ని గూర్చి ప్రశ్నించారు. యేసు వారికి ఇచ్చిన జవాబుకు వారు ప్రత్యుత్తరము చెప్పలేక పోయారు. (20:1-8, 20-44).

**III.పరిపూర్ణ మానవుని శ్రమలు : (22-23 అధ్యా) :**

ఈ భాగంలో ప్రభువు భోజన సంస్కారము ప్రారంభించబడింది. దాని సంస్థాపకుడు యేసే. ఈ సందర్భంగా ఆయన "మీ కొరకు చిందించబడుతున్న నా రక్తము" అని చెప్పిన మాటలు మత్తయి సువార్తకు వేరుగా ఉన్నాయి. మత్తయి అనేకుల కొరకు చిందించబడిన రక్తము అని వ్రాసాడు. లూకా దాని వ్యక్తిగతంగా అన్వయించాడు. "నన్ను జ్ఞాపకముచేసికొనుటకు దీనిని చేయుడి" అన్న మాటలను కూడ చేర్చాడు. ఒక వైపు ఆయన మరణానికి సమీపిస్తూ ఉండగా, ఆయన శిష్యులు తమలో ఎవరు గొప్పవారని తర్కిస్తూ ఉన్నారు. (22:24-27).

ఆయన గెత్సమనే తోటలో ప్రార్థిస్తున్నప్పుడు, ఆయన చెమట నేలపడుచున్న గొప్ప రక్తబిందువుల వలె అయిందని, పరలోకం నుండి దూత ఆయనకు కనబడి బలపర్చాడని లూకా ఒక్కడే తన సువార్తలో వ్రాసాడు. కీర్తన 41:9 జెకర్యా 11:12 లో వ్రాయబడినట్లు ఆయన తన స్వంత శిష్యునిచే శత్రులకు అప్పగించబడ్డాడు. పేతురు ప్రధానయాజకుని దాసుని కుడి చెవి నరకడం, యేసు దానిని ముట్టి బాగుచేయడం లూకా సువార్తలోనే స్పష్టంగా వ్రాయబడింది.

ఆయన పిలాతు వద్దకు తరువాత హేరోదునొద్దకు తీర్పు కొరకు పంపించబడడం (23:1-12) తరువాత సిలువను మోసికొని కపాల స్థలమునకు వెళ్ళడం చూస్తాము. కల్వరీ అని అర్థమిచ్చే కపాల స్థలము పేరును మరియు ఆయనతో పాటు సిలువ వేయబడిన ఇద్దరు దొంగలను గూర్చి లూకా వివరణను (23:39-45) చూస్తాము. యేసు సిలువలో పలికిన ఏడు మాటలలో మూడు మాటలను (23:34, 43, 46) లూకా నమోదు చేసాడు.

**IV. పరిపూర్ణ మానవుని విజయం (24:1-53) :**

సిలువలోని దుఃఖం మరియు మరణం, సమాధిని గూర్చిన నిరాశ, చీకటుల నుండి లూకా సువార్త మహిమాన్వితమైన పునరుత్థాన అరుణోదయంలోనికి నడిపించబడింది. ఇతర సువార్తల గ్రంథకర్తలు పేర్కొనని ఎమ్మాయి సంఘటన లూకా సువార్తలో వ్రాయబడింది.

పునరుత్థానుడయ్యాక కూడ ఆయన తన మరణానికి ముందు ఉన్నట్లే ప్రేమగల స్నేహితునిగా ఉన్నాడని ఈ సందర్భంలో ఆయన ఆ ఇద్దరు శిష్యులకు బయలుపరచాడు. వారు ఆయనను యింటిలోనికి ఆహ్వానించినప్పుడు తన్నుతాను వారికి ప్రత్యక్షపరచుకొన్నాడు. వారు యెరూషలేముకు తిరిగి వస్తూ ఉండగా ఆయన తనను గూర్చిన ఋజువులను వారికి చూపించాడు. ఆయన ఎముకలు మరియు మాంసముగల నిజమైన మానవుడని



నిరూపించాడు. ఇవన్నీ లూకా సువార్తలోనే వ్రాయబడ్డాయి.

యేసు 11 పునరుత్థాన ప్రత్యక్షతలలో లూకా సువార్తలో 4 ప్రత్యక్షతలు వ్రాయబడ్డాయి. చివరిగా ఆయన వారిని బేతనియ వరకు తీసికొనిపోయి వారిని ఆశీర్వదిస్తూ ఉండగా పరలోకమునకు ఆరోహణుడయ్యాడు. ఇక ఆయన కేవలం యెరూషలేమునకు మాత్రమే పరిమితమైన క్రీస్తు కాదు. ఆయన సార్వత్రిక క్రీస్తుగా ఉన్నాడు. శిష్యులతో భౌతికంగా కలిసి లేడు కాని సదాకాలము వారితోనే ఉన్నాడన్న నిరీక్షణతోవారు మహానందముతో యెరూషలేముకు తిరిగి వెళ్ళారు. ప్రభువు కార్యోన్ముఖులయ్యారు.

ఆయన మనలో ఒకనివంటి వాడయ్యాడు (1:1-3:8). మనవలెనే శోధించబడ్డాడు (4:1-8:3) కాని పాపము చేయని పరిపూర్ణమానవునిగా మనకు మాదిరినుంచి వెళ్ళాడు (హెబ్రీ 4:15) మన బలహీనతలలో సహానుభవము గలవాడు (8:4-12:48). ఆ మనుష్యుడు మాట్లాడినట్లు ఏ మనుష్యుడు మాట్లాడలేదు (17:1-19:27) ఆయన మన మానవ సమీప బంధువు. మన విమోచకుడు (19:28-33:56) పునరుత్థానము పొందినవారిలో ప్రథమ ఫలముగా ఉన్న పరిపూర్ణమానవుడాయనే (24:1-33). ఆయన యందు విశ్వాసముంచినవారందరు పరిపూర్ణులవ్వాలని కోరుతున్నాడు. ప్రతి విశ్వాసి అట్టి పరిపూర్ణతలోనికి ఎదిగినప్పుడే ఆయన సిలువ కార్యానికి పరిపూర్ణతను చేకూర్చినవార మౌతాము. అట్టి కృప ప్రభువు మనందరికి దయచేయునుగాక!


## ప్రేమధార పాఠకులకు ఒక విజ్ఞప్తి

భారత దేశములో గత 30 సంవత్సరములుగా రేడియో ద్వారా సువార్తను ప్రకటిస్తున్న ట్రాన్స్ వరల్డ్ రేడియో - ఇండియా (టి.డబ్ల్యు.ఆర్-ఇండియా) దర్శనం ప్రకారం రేడియో ద్వారా సువార్త ప్రకటించి, రక్షించబడిన వారిని సంఘాలలో బలపర్చాలని, సామాజిక వికాస పథకాల ద్వారా సమాజాన్ని రూపాంతరపర్చాలని ఆశిస్తున్నాం. అందుకు మీ ప్రార్థన, ఆర్థిక సహకారాలు ఎంతైన అవసరం. ఈ రేడియో కార్యక్రమాలను మీ బంధువులకు, స్నేహితులకు, ఇరుగు పొరుగు వారికి పరిచయం చేయండి. ఇక నుండి రేడియో పరిచర్య నిమిత్తం మీరు పంపించే విరాళాలు (చెక్కు/డిమాండ్ డ్రాఫ్ట్/మనియార్డర్) "ట్రాన్స్ వరల్డ్ రేడియో-ఇండియా" (Trans World Radio - India) పేరు మీద తీసి మా చిరునామాకు పంపించవలసినదిగా మనవి చేస్తున్నాము. ప్రభువు మీకిచ్చిన ధనాన్ని విలువైన దాని కొరకు పెట్టుబడిగా పెట్టి నిత్యత్వంలో అధిక లాభాన్ని పొందాలని ఆశిస్తున్నాం. ప్రభువు మిమ్మల్ని, మీ కుటుంబాన్ని సమృద్ధిగా దీవించునుగాక! ఆమేన్!!



**TTB - Telugu - Study Outlines - Gospel of LUKE**

Printed by : Premadhara, Trans World Radio - India, 12-1-334/17/3, Lalapet, Secunderabad - 500 017. Ph : 040-27003011.

**FREE** MP3 DOWN LOAD - Log on to :
**www.radio882.com**